

ఉష్ణోగ్రత
గరిష్ఠం 41.6
కనిష్ఠం 19.6



సమస్యలను వింటున్న జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

» సమస్యలను సత్వరమే పరిష్కరించాలి
» ప్రజావాణికి 51 వినతులు.. జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 51 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏవో సునీల్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ శ్రీలత

సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయాలి

» జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ విధానంలో పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత అన్నారు. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా వ్యవసాయ ఉత్పత్తులు పండించేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని సీఆర్పీలను ఆదేశించారు. సేంద్రియ ఉత్పత్తులను మహిళా రైతు ఉత్పత్తి సంస్థల ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. జిల్లాలో ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ(ఎఫ్‌పీసీ)లు కేశంపేట, చేవెళ్ల, యాచారం పరిధిలో ఏర్పాటు కానున్నట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో డీపీఎంలు విలాస్‌రావు, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ కోఆర్డినేటర్ చిన్న శేఖర్, బాల్‌రాజ్, నర్సింహులు, యాదయ్య, ఏపీఎంలు శిరీష, సీఆర్పీలు పాల్గొన్నారు.



పాతాళానికి జలం!

పైకి రానంటున్న గంగమ్మ

జిల్లా ప్రజలు ఈ వేసవిలో దాహం దాహం.. అని అల్లాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భూగర్భ జలాలు పాతాళానికి చేరడంతో గుక్కెడు నీటి కోసం ఎక్కిళ్లు తప్పేలా లేవు. రోజురోజుకూ నీటి మట్టం పడిపోతుండటంతో మండలాల్లో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఒక వైపు భానుడి భగభగలు.. మరోవైపు విచ్చలవిడిగా నీటి వినియోగం పెరగడంతో ముున్ముందు సమస్య తీవ్రమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. బోర్లు, బావులు ఇంకి పోతున్నాయి. వాగులు వంకలు ఎడారిని తలపిస్తున్నాయి. 1200 ఫీట్ల వరకు బోరు వేసినా చుక్క నీరు రావడం లేదంటే దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.

- అడుగంటిన భూగర్భ జలాలు
- జిల్లాలో డేంజర్ బెల్స్
- సగటున 2.33 మీటర్ల తగ్గుదల
- విచ్చలవిడిగా నీటి వినియోగం
- వట్టిపోతున్న బోర్లు, బావులు
- చెరువులు, కుంటలు వెలవెల
- తాగునీటికీ తప్పని కష్టాలు
- శేరిలింగంపల్లి, సరూర్‌నగర్‌లో ప్రమాద ఘంటికలు

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. తాగు, సాగునీటి అవసరాలు పెరిగిపోవడంతో గంగమ్మ పాతాళానికి చేరింది. వేసవిలో ముున్ముందు నీటి సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణం కంటే అధికంగా వర్షాలు కురిసినా ఆశించిన స్థాయిలో భూగర్భ నీటి మట్టం పెరగలేదు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండటంతో రైతులు బోర్ల కింద అధికంగా పంటలు సాగు చేస్తున్నారు. అంతేకాకుండా గృహ అవసరాలకు కూడా నీటి వినియోగం పెరిగిపోయింది. దీంతో భూగర్భ జల మట్టం పడిపోయి యాసంగిలో సాగు చేసిన వరి పంటలు నీరందక ఎండిపోతున్నాయి. ప్రస్తుతం భానుడు భగ్గుమంటున్న తరుణంలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భూగర్భ జలాలు అత్యంత వేగంగా పడిపోవడానికి ఎండ తీవ్రత కూడా ఒక కారణమని చెప్పవచ్చు.

మీటర్ల లోతులోకి..

జిల్లాలో 11 మండలాల్లో 20 మిల్లీ మీటర్ల కంటే అధికంగా వర్షపాతం నమోదు కాగా, 16 మండలాల్లో

మిగతా 8వ పేజీలో...

నీటిని పొదుపుగా వాడుకోవాలి

నీటిని పొదుపుగా వాడుకోవాలి. వేసవిలో ప్రతీ బొట్టును ఒడిసిపట్టి అవసరాలకు వాడుకోవాలి. భూగర్భ జలాలను విచ్చలవిడిగా తోడేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో భూగర్భజల మట్టం తగ్గుతుంది. ఇష్టారాజ్యంగా బోరు బావుల తవ్వకాలు ఆపాలి. ఇంటింటికీ ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉంటుంది. జిల్లాలో అత్యధిక నీటి వినియోగ మండలంగా శేరిలింగంపల్లి నమోదైంది. ఈ నియోజకవర్గంలో భూగర్భ జలాలు అట్టడుగుకు చేరాయి.

- మాధవరావు, జిల్లా భూగర్భజల శాఖ అధికారి



మురుగు సమస్యను పరిష్కరిస్తాం

» డీఎల్‌పీవో సాధన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని గ్రామాల్లో రోడ్లపై మురుగు పారకుండా చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో సాధన తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రహదారులపై మురుగునీరు' కథనానికి ఆమె స్పందించారు. గ్రామాలలో మురుగునీటి కాలువల పరిస్థితిపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఎంపీవో శ్రీలతను ఆదేశించారు. ఏ గ్రామంలోనూ రోడ్లపై మురుగు నీరు నిలవకుండా చూడాలని సూచించారు. గ్రామాలను సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీవో శ్రీలత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకు అయ్యవారిగూడ గ్రామస్తులు 'ఆంధ్రజ్యోతి'కి ధన్యవాదాలు తెలిపారు.

సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : డీఆర్‌డీవో, యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సమ్మర్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీవో పీడీ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు నేటి (మంగళవారం) సాయంత్రం వరకు ఆన్‌లైన్‌లో (https://satgasc.telangana. gov.in) దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.



తాటి ముంజలు భలే మజా

- ఆరోగ్యానికి మేలు..
- కొనుగోలుకు ఆసక్తి
- జిల్లాల నుంచి తెచ్చి హైదరాబాద్‌లో అమ్మకాలు
- వంద రూపాయలకు డజను చొప్పున విక్రయం

7

వడివడిగా..!

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగిరం

- కేశంపేట మండలానికి 745 ఇళ్ల మంజూరు
- పైలెట్ గ్రామం పోమాల్‌పల్లిలో కొనసాగుతున్న ఇంటి నిర్మాణాలు
- ఐదుగురు లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున చెల్లింపు
- నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ



గోడల వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): పేదోడి సొంత ఇంటి కళ నెరవేరబోతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వడివడిగా సాగుతున్నాయి. కేశంపేట మండలంలో పోమాల్‌పల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. గ్రామంలో 36 మంది లబ్ధిదారులను గుర్తించారు. వారు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అనుమతులిచ్చారు. ఇందులో 25 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. 11 మంది ఇళ్లు కట్టడానికి ముందుకు రాకపోవడంతో వారి ఇళ్లను నిలుపుదల చేశారు. ప్రస్తుతం 21 ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ లెవల్

మిగతా 8వ పేజీలో...

745 ఇళ్లు మంజూరు

కేశంపేట మండలంలో 29 గ్రామ పంచాయతీలకు మొదటి విడతలో 745 ఇళ్లను మంజూరు చేశారు. నంగెం(19), ఎక్లాస్‌ఖాన్‌పేట(33), బైర్కాన్‌పల్లి (24), మంగళగూడ(30), అల్వాల(38), కొత్తపేట(55), కొనాయపల్లి(20), సంతాపూర్(35), పాటిగడ్డ(11), చౌలపల్లి(26), బొదునంపల్లి(19), లేమామిడి(22), సుందరాపురం(12), కాకునూర్(30), నిర్ధవెల్లి(41), తొమ్మిదిరేకుల(18), లింగంధన(23), కొండారెడ్డిపల్లి(35), చింతకుంటపల్లి(27), వేముల్‌నర్వ(50), దత్తాయపల్లి(6), ఇప్పలపల్లి(15), పాపిరెడ్డిగూడ(36), దేవునిగుడి తండా(25), కేశంపేట(50), పొల్కోనిగుట్టతండా(12), పుట్టోనిగూడ(22), తూర్పుగడ్డతండా(11) ఇళ్లు మంజూరయ్యాయి.



వేగంగా నిర్మాణ పనులు

ప్రభుత్వం మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసింది. కేశంపేట మండలంలో పోమాల్‌పల్లి గ్రామాన్ని పైలెట్‌లో తీసుకున్నాం. ఇక్కడ 36 మందిని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఎంపిక చేశాం. అందులో 11 మంది ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రాలేదు. ప్రస్తుతం గ్రామంలో 25 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. 17ఇళ్ల ఫొటో క్యాప్చర్ చేశాం. ఐదుగురికి లక్ష రూపాయల చొప్పున వారి ఖాతాలో డబ్బులు జమ చేశాం.

- రవిచంద్ర కుమార్‌రెడ్డి, ఎంపీడీవో, కేశంపేట

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

» సీసీఎల్ఏ డిప్యూటీ కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చౌదరిగూడ,మే 5(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని సీసీఎల్ఏ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం మహదేవ్‌పూర్, రేగడి చిల్కమర్రి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ఆర్. సరిత తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. రేగడి చిల్కమర్రిలో మొత్తం 36 దరఖాస్తులు, మహదేవ్‌పూర్‌లో 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్‌లు జగదీశ్వర్, రమేష్‌కుమార్‌లు తెలిపారు. కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ ఆర్‌ఐలు శ్రీనివాస్ రెడ్డి, శివ, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.



రేగడి చిల్కమర్రిలో బండలాగుతున్న ఎద్దులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

పాల్గొన్న ఎనిమిది జతల ఎద్దులు

చౌదరిగూడ, మే5(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండల పరిధిలోని రేగడి చిల్కమర్రిలో బండలాగుడు పోటీలు అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ రెండో వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో బండ లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం ఎనిమిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. మొదటి బహుమతి రామాంజనేయులు గార్లదిన్నే అనంతపురం జిల్లా రూ.80 వేలు నగదు, రెండో బహుమతి రామాంజనేయులు జ్వాల బాహుబలికి రూ.60 వేల నగదు, మూడో బహుమతి బుల్స్ డాక్టర్ అఖిలేష్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా రూ.40 వేలు నగదు, నాలుగో బహుమతి రూ.30 వేల నగదును గోపాలకృష్ణ చిన్నంబావి వనపర్తి జిల్లా, ఐదో బహుమతి ఖాజాహుసేన్ పల్కం దొడ్డి రాయచూర్‌కు రూ.20 వేలు, ఆరో బహుమతి రూ.20 వేల నగదు, హనుమాన్ బుల్స్ సత్యనారాయణ కొప్పొల్, గుర్రంపొడ్, నల్గొండ జిల్లాకు చెందిన ఎద్దులు బహుమతులు గెలుపొందాయి. కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ సర్పంచ్ బుచ్చమ్మ, నాయకులు బుచ్చయ్య, ఈట గణేష్, రాజేష్‌పటేల్, జమాల్‌పూర్ రాణిబాయి బందూలాల్, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, ఎడ్ల రవికుమార్, శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మల్లు రవి

కడ్తాల్, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో రైతుల కష్టాలు తీరి వివిధ పంటల సాగు, ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ఫలితాలను రైతులకు చేర్చాలని సూచించారు. కడ్తాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డిలతో కలిసి రవి ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, ఏవో శ్రీలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.నర్సింహ, పీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్య, వెంకటేశ్, శ్రీపాల్, సేవ్యానాయక్, దేవ్యా, అంజిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ నరేశ్ పాల్గొన్నారు. కడ్తాలలో 30పడకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి ఎంపీ రవిని కోరారు. యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. కడ్తాల శివారులోని సర్వే నంబర్ 260/70లో 9.36ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో ఆసుపత్రి భవనం నిర్మించాలన్నారు.

దారంతా పూల తోరణం

ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ నుంచి ఎలిమినేడుకు వెళ్లే రోడ్డు ఇరువైపులా గుల్ మోహర్ చెట్లు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆ చెట్లకు విరగబూసిన ఎర్రని పూలు బాటసారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. గత ప్రభుత్వం హరితహారంలో నాటిన ఈ మొక్కలు ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఎండలో ప్రయాణం చేసి వస్తున్న వాహనదారులు కొంతసేపు ఈ చెట్ల నీడన సేదతీరి వెళ్తున్నారు.

ఆదిభట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి)



కాంగ్రెస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే సంతాపం


రమణారెడ్డికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు చింతల రమణారెడ్డి ఆకస్మికంగా మృతిచెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని హైదరాబాద్‌లోని నివాసంలో కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎంపీ పోతుగంటి రాములు సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తాండూరు డిగ్రీ కళాశాలలో కొత్త కోర్సులు

తాండూరు, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎస్. లక్ష్మన్ వెల్లడించారు. ఇందుకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి లభించిందని ఆయన పేర్కొన్నారు. బీఎస్సీ(ఫిజికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్) బీఎస్సీ(లైఫ్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్), బీకాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ(కంప్యూటర్ అప్లికేషన్స్) బీఏ(మాస్ కమ్యూనికేషన్, జర్నలిజం), (సోషియాలజీ, ఆంత్రొపాలజీ, సైకాలజీ, జాగ్రఫీ, పబ్లిక్ ఆప్లికేషన్) కోర్సులను కొత్తగా ఈ ఏడాది నుంచి ప్రారంభిస్తామని చెప్పారు.



తాండూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

డిజిటల్ ల్యాబ్ సౌకర్యం

హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్టవిటీ కలిగిన నాలుగు డిజిటల్ తరగతులు, ఆధునాతన నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వర్చ్యువల్ తరగతులు, ఆన్‌లైన్ వెబినార్, సెమినార్ సదస్సులు, పరీక్షలు, తరగతులకు ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ చెప్పారు.

మూడు విడతల్లో అడ్మిషన్లు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ.200 చెల్లించాలి. ఈ నెల 21 వరకు దరఖాస్తుల స్వీకరిస్తారు.పదోతేదీ నుంచి 21 వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయి. 29న తొలి లిస్ట్ విడుదల చేస్తారు. జూన్ 24 నుంచి 28లోపు విద్యార్థులు కాలేజీలో రిపోర్ట్ చేయాలి. జూన్ 30 నుంచి ఫస్ట్‌సెమిస్టర్ తరగతులు ప్రారంభిస్తారు.

ఘనంగా కామరాతి బీరప్పస్వామి కల్యాణోత్సవం


కల్యాణ మహోత్సవంలో మాజీ జెడ్పీటీసీ శ్రీలత-సత్యనారాయణ దంపతులు, గ్రామస్తులు

కొత్తూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీపల్లి ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బీరప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు, షెపర్డ్ ఇండియా ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్మె సత్యనారాయణ ఆధ్వర్యంలో వారంలో రోజలుగా కామరాతి బీరప్ప ఆలయ ప్రారంభ మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. సోమవారం కామరాతి బీరప్ప కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తెల్లవారు జామునుంచే పూజాకార్యక్రమాలతో మహోత్సవం ప్రారంభమైంది. మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ దంపతులు, పలువురు గ్రామస్తులు పాల్గొని కల్యాణాన్ని జరిపించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, జైపాల్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ క్యామ మల్లేష్, జెడ్పీ మాజీచైర్మన్ అనితారెడ్డి, కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేష్ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రజలు గృహాలను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుకుని కుటుంబ సభ్యులు, బంధువులతో తరలి వచ్చి కల్యాణంలో పాల్గొని విందు చేసుకున్నారు. కల్యాణ మహోత్సవానికి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి కామరాతిబీరప్ప కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు అంబటి ప్రభాకర్, ఎమ్మె వెంకటయ్య, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, శ్రీనివాస్‌గౌడ్, బి.దేవేందర్‌యాదవ్, ఎమ్మె సత్తయ్య, అందె మెహన్, జంగ నర్సింహ, కృష్ణ, శ్రీశైలం, అంజనేయులు, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఐలయ్య

బార్ కౌన్సిల్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి.. షోకాజ్ నోటీసులు

ఇబ్రహీంపట్నం, మే 5(ఆంధ్రజ్యోతి): బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా కార్యవర్గాన్ని ప్రకటించుకున్న న్యాయవాదులకు సోమవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముద్దం వెంకటేశం, అరిగె శ్రీనివాసకుమార్ తెలిపారు. ఇబ్రహీంపట్నం అదనపు జిల్లా న్యాయస్థానాల సముదాయంలో బార్‌అసోసియేషన్ 1989లో రిజిస్టరై తెలంగాణ బార్ కౌన్సిల్ గుర్తింపు పొందిందని, అప్పటి నుంచి న్యాయవాదుల అసోసియేషన్‌కు ప్రతీ సంవత్సరం ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గత నెల 15న సైతం ఎన్నికలను నిర్వహించగా న్యాయవాదులు ఎన్నికలో పాల్గొని బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని చెప్పారు. కాగా ఎన్నికల్లో ఓడిన కొంతమంది న్యాయవాదులు నిబంధనలకు విరుద్ధంగా ఈ నెల 2న అనధికారికంగా సొంతంగా కార్యవర్గాన్ని ప్రకటించుకొని సోషల్ మీడియాల్లో, వార్తా పత్రికల్లో ప్రచురణ చేయించారని తెలిపారు. ఇది బార్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకమన్నారు. ఇందుకు బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ బార్ కౌన్సిల్ సిఫారసు మేరకు బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని వారు వివరించారు.

ప్రజావాణికి వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఆర్వో హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, మే 5(ఆంధ్రజ్యోతి):ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఆయా శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో డీఆర్వో, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డిలు ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ.. వివిధ శాఖల్లోని ప్రజాసమస్యలపై నిర్వహిస్తున్న ప్రజావాణ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే వినతులపై అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతుల పై చేపట్టిన చర్యలను తెలియజేసేలా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో స్టేటస్‌ను అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణిలో 91ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వ భూమి కేటాయించాలి


ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న ఓరుగంటి యాదయ్య

రంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని భవన నిర్మాణ కార్మికుల కోసం సర్వే నంబర్ 323లోని ప్రభుత్వ భూమిని కేటాయించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీవోసీ అధ్యక్షుడు జనార్ధన్, సుందరమ్మ, నాగేశ్వర్, ఎన్.లక్ష్మి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతానవమి ఉత్సవం


నాగలి దున్నుతున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం సీతానవమి ఉత్సవాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో సీతామాత చిత్రపటానికి పూజచేసి ఉత్సవాన్ని కొనసాగించారు. నాగటి సాలులో సీతామాత ఉద్భవించినందున కాడెడ్ల నాగలి కట్టి నర్సింహులు భూమి దున్ని ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణను తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంతానం కోసం జనక మహారాజు యాగం చేసి, నాగలిపట్టి దున్నుతుంటే నాగటి సాలులో సీతామాత ఉద్భవించిందని తెలిపారు. నవమి రోజు శ్రీరామచంద్రుడు జన్మిస్తే నెల రోజుల తరువాత నవమి రోజే సీతామాత ఉద్భవించిందని తెలిపారు. శ్రీరామచంద్రుడి మాటను జవదాటకుండా తర తరాలకు ఆదర్శమూర్తిగా నిలిచిందని తెలిపారు. కొన్ని గంటల్లోనే పట్టాభిషేకం కాబోతున్న సమయంలోనే భర్తతోపాటు ఆభరణాలు త్యజించి, నార వస్త్రాలతో ఆరణ్యవాసం చేసిన పుణ్యమూర్తి సీతాదేవి అని అన్నారు. భార్యగా, తల్లిగా, వదినగా తరతరాలకు గొప్ప సందేశమిచ్చిన సీతామాత జయంతి ఉత్సవాన్ని ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని నర్సింహులు ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పలబట్ల బాల్‌రాజ్‌గుప్తా, ఒగ్గు కిషోర్, కక్కునూరి సంఘమేశ్వర్, కానుగు రాంభూపాల్, ఇప్పలపల్లి లక్ష్మి, యాదయ్య పాల్గొన్నారు.

గట్టిప్పలపల్లి మండలం కోసం కొనసాగుతున్న దీక్షలు

తలకొండపల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సాధనకు గట్టిప్పలపల్లి వాసులు చేస్తున్న రిలే నిరశన దీక్షలు సోమవారం నాటికి 190వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు మాట్లాడుతూ 11 పంచాయతీలతో గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా చేయాలని కోరారు.


భోజన కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ

మార్కెట్‌లో రైతులకు ఉచిత భోజనం

ఆమనగల్లు, మేే5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ ఉదారతను చాటుకున్నారు. మార్కెట్ యార్డ్‌లో రైతులకు సొంత డబ్బుతో ఉచిత భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాల నుంచి ధాన్యాన్ని తెస్తున్నారు. వారికోసం మధ్యాహ్నం సమయంలో భోజన వసతి కల్పించాలని సోమవారం మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్లతో కలిసి భోజన కేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ముగిసే వరకు ఉచిత భోజనాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు మిట్టపల్లి అంజయ్య, వస్పుల శ్రీశైలం, సంపత్, పాండురంగయ్య, నరేశ్‌నాయక్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు, నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎగిశెట్టి సత్యం, కాలె మల్లయ్య, శ్రీను, బీచ్యనాయక్, వెంకటేశ్, అలీం, నాజర్ పాల్గొన్నారు.

క్యాంటీన్ ఏర్పాటుకు తీర్మానం

ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు బార్ అసోసియేషన్ సభ్యులు తీర్మానించారు. సోమవారం అసోసియేషన్ సమావేశమై కోర్టుకు వచ్చే వారి సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ఏర్పాటుకు ఆసక్తి గల వారి నుంచి టెండర్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీకల్లా రూ.2వేల టెండర్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం


ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న యువకులు

యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని నగరానికి దీటుగా అభివృద్ధి చేస్తామని, ఇందులో అనుమానాలకు తావులేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చెప్పారు. సోమవారం మంతన్‌గౌరెల్లికి చెందిన 100మంది వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తీరిస్తే జనం మనల్ని ఎల్లకాలంగుర్తుంచుకొని మనకే అధికారం అప్పగిస్తారన్నారు. నాయకులు గ్రామీణుల సాధకబాధకాలను తీర్చాలని కోరారు. ఆదివారం రాత్రి చౌదర్‌పల్లిలో శ్రీసీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అరవింద్‌నాయక్, ఎల్లయ్య, యాట శ్రీను, అఖిల్, సత్యనందు, రమేశ్ ఉన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే ఘన స్వాగతం

కొత్తూర్, మే 5(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం కన్హా శాంతివనంలో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తిమ్మాపూర్ వద్ద ఘన స్వాగతం పలికారు. మంత్రి తిమ్మాపూర్‌నకు చేరుకోగానే ఎమ్మెల్యే శంకర్ బొకే అందజేసి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు.


రైతుకు ఆర్డర్ కాపీని అందిస్తున్న ఆర్డీవో చంద్రకళ

భూ భారతితో సమస్యల పరిష్కారం

చేవెళ్ల, మే 5(ఆంధ్రజ్యోతి): నూతన భూ భారతి చట్టంతో ఏళ్లనాటి భూ సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. మొయినాబాద్ మండలం కేతిరెడ్డిపల్లికి చెందిన మోహన్‌రెడ్డికి సర్వే నంబర్లు 397, 399లలో ఎకరం 12గుంటల భూమి ఉంది. ఆ భూమి కోసం మోహన్‌రెడ్డి భార్య కోర్టులో కేసు వేయగా తీర్పు మోహన్‌రెడ్డికి అనుకూలంగా వచ్చింది. కోర్టు తీర్పు ఆధారంగా మోహన్‌రెడ్డి పట్టా పాస్ బుక్ కోసం తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్డీవో భూ భారతి పోర్టల్ ద్వారా మోహన్‌రెడ్డి సమస్యను పరిష్కరించి అతడికి సోమవారం ఆర్డర్ కాపీని అందజేశారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

గురూజీ మఠం శేఖరయ్య మృతి

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): లేమామిడికి చెందిన ఆధ్యాత్మిక గురూజీ, మఠం శేఖరయ్య ఆదివారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ సోమవారం ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ అంజిరెడ్డి, జమాల్‌ఖాన్, తలసాని వెంకట్‌రెడ్డి, అనుమగళ్ల రమేష్, శ్రీశైలంగౌడ్‌లు నివాళ్లు అర్పించారు. ఆమనగల్లు, మహేశ్వరం, షాద్‌నగర్, జడ్చర్ల ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి నివాళి అర్పించారు. కర్ణాటక నుంచి వచ్చిన మఠం స్వాములు శివైక్య కార్యక్రమాలు నిర్వహించారు.


రాజారత్నంకు సమ్మె నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, ట్రేడ్ యూనియన్ల పిలుపుమేరకు ఈ నెల 20 నుంచి పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు. సోమవారం కేశంపేట మండల పంచాయతీ కార్మికులు ప్రత్యేకాధికారి రాజారత్నం, ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డిలకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రామచంద్రయ్య, రవి, పారేష, పద్మ, అంజయ్య, మల్లయ్య, రోశయ్య పాల్గొన్నారు.

» రోడ్ల పక్కన విరివిగా విక్రయాలు
» ఇతర ప్రాంతాల నుంచి హైదరాబాద్ శివారుకు లారీల్లో తరలిస్తున్న వ్యాపారులు
» వేసవిలో ముంజలకు భారీ గిరాకీ!

తాటి ముంజలు
భలే మజా


ఎన్ఎఫ్‌సీనగర్ వద్ద తాటి ముంజల అమ్మకాలు

ఘట్‌కేసర్, మే 5(ఆంధ్రజ్యోతి): ఎండకాలంలో చాలా మంది తినేందుకు ఇష్టపడే తాటి ముంజలను నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్, నగర శివారు ప్రాంతాలకు భారీ మొత్తంలో తాటికాయలను తెచ్చి ముంజలను వొలిచి విక్రయిస్తున్నారు. శరీరానికి చల్లదనాన్నిచ్చే తాటి ముంజలకు భారీ గిరాకీ ఉంటోంది. చిన్నాపెద్ద ఇష్టంగా తినే తాటిముంజలు అన్నిచోట్లా రోడ్ల పక్కన విరివిగా లభిస్తున్నాయి. వందలాది మంది చిరు వ్యాపారులు ఉమ్మడి నల్గొండ జిల్లా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తాటి ముంజలు తెచ్చి విక్రయిస్తున్నారు. ఉదయమే తాటిచెట్ల వద్దకు వెళ్లి గీత కార్మికులతో తాటి కాయలను కోయించి తెచ్చి వాటి నుంచి ముంజలు ఒలిపించి ప్లాస్టిక్ ట్రేలు, బుట్టల్లో నగరానికి తెస్తున్నారు. మరొ కొందరు ఏకంగా తాటి కాయలే తెచ్చి అమ్మేచోటనే వొలిచి విక్రయిస్తున్నారు. ఉదయం 11గంటలకల్లా చౌరస్తాల్లో అమ్ముకుంటున్నారు. వేసవిలో అటు గౌడన్నలకు, ఇటు చిరు వ్యాపారులకు 45 రోజుల పాటు ఉపాధి లభిస్తోంది.


ముంజలను వొలుస్తున్న అమ్మకందారులు

ఉపశమనం, ఆరోగ్యం

హైదరాబాద్, నగరశివారుల్లో తాటి ముంజలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎండ వేడి నుంచి ఉపశమనం కల్గించడంతో పాటు ఆరోగ్యానికి మేలుచేసే తాటి ముంజలు తినేందుకు అందరూ ఆసక్తి చూపుతారు. ఆంధ్రప్రదేశ్‌లో తాటి చెట్లు ఎక్కువగా ఉండే గుంటూరు జిల్లా రేపల్లె, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల నుంచి లారీల్లో తాటికాయలు తెచ్చి రోడ్ల పక్కన డంప్ చేసి విక్రయిస్తున్నారు. కొనుగోలుదారుల ముందే తాటికాయలను ఒలిచిస్తుండటంతో ఎక్కువ మంది తాటికాయల కుప్పల వద్ద కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఘట్‌కేసర్, సమీప ప్రాంతాలు, టౌన్‌షిప్‌ల వద్ద, కాలనీల్లో తాటి ముంజల విక్రయాలు భారీగా సాగుతున్నాయి.

ధర మాత్రం అంతే

గుంటూరు జిల్లా నుంచి పెద్దఎత్తున తాటికాయలను తెచ్చి వాటి నుంచి ముంజలను తీసి అమ్ముతున్నా ధరలో మాత్రం తేడా లేదని కొనుగోలు దారులువాపోతున్నారు. స్థానికంగా వంద రూపాయలకు డజను చొప్పున విక్రయిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి లారీల లోడ్లతో తాటికాయలు తెస్తున్నా ధర మాత్రం తగ్గడం లేదని కొనుగోలుదారులు అంటున్నారు. అయితే రవాణాచార్జీలు ఎక్కువ అవుతున్నాయి కాబట్టి స్థానికంగా లభించే ముంజల కంటే తక్కువ రేటుకు రావని అమ్మకందారులు చెబుతున్నారు. అలాగే తాము తక్కువ ధరకు అమ్మితే స్థానిక వ్యాపారుల నుంచి సైతం ఆక్షేపణ వస్తుందని, అందరితోపాటే తామూ అమ్మాల్సి ఉంటుందన్నారు.

తాటి ముంజలు మేలు చేస్తాయి



ఎండాకాలంలో లభించే తాటి ముంజలను నేను తప్పక తింటాను. ఎండవేడిలో శరీరానికి చల్లదనాన్ని చేకూరుస్తాయి. చిన్నప్పటి నుంచి తాటి ముంజలను ఇష్టంగా తింటున్నా. వాటిల్లో ఎలాంటి కల్తీ చేయడానికి అవకాశమే. ఇప్పుడు లభిస్తున్న కల్తీలేని పదార్థాల్లో తాటి ముంజలను చెప్పుకోవచ్చు.

- మేడబోయిన వెంకటేశ్, ఎన్ఎఫ్‌సీనగర్

ఇష్టంగా తింటా



కేవలం ఎండాకాలంలోనే లభించే తాటి ముంజలంటే నాకు ఎంతో ఇష్టం. ఎండవేడితో ఇబ్బంది పడేవారికి చల్లదనాన్నిస్తాయి. ఆరోగ్యానికి కూడా మేలుచేస్తాయి కనుక వీటిని తినాలని వైద్యులు సైతం సూచిస్తున్నారు. సహజసిద్ధంగా దొరుకుతున్న తాంటి ముంజలను అందరూ తినాలి.

- సీహెచ్.హరికాంత్‌రెడ్డి, చందుపట్లగూడ

లయన్స్ క్లబ్ పీఆర్వోగా పాషా



ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు లయన్స్ క్లబ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్‌గా ఎమ్.ఏ.పాషా 16వ సారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పిస్తూ క్లబ్ సేవలను విస్తరిస్తున్నందుకు గాను మరోసారి పాషాకు మరో అవకాశం కల్పించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రతి ఏడాది నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటుంది. 2009 నుంచి పీఆర్‌ఓగా పాషా ఎన్నికవుతున్నారు. పాషా లయన్స్‌క్లబ్ నుంచి రాష్ట్ర, అంతర్జాతీయ స్థాయిలో అనేక సేవా పురస్కారాలు అందుకున్నారు. పీఆర్‌ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో పాషాను పలువురు అభినందించారు. తన ఎన్నికకు సహకరించిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, రాంరెడ్డి లయన్స్ క్లబ్ ఆసుపత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ వీరబొమ్మ భిక్షపతి, సభ్యులకు పాషా కృతజ్ఞతలు తెలిపారు.

పార్కు స్థలాన్ని కాపాడాలి

ఘట్‌కేసర్, మే 5(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధి అన్నోజిగూడ, సాయిగణేష్ కాలనీ పార్కు స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని కాలనీవాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్లాట్ నంబర్ 43, 44ల మధ్యలో నిబంధనల మేరకు వదిలిన స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలోనూ అక్రమ నిర్మాణం చేస్తుంటే అప్పటి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా నిర్మాణాలను కూల్చివేశారని గుర్తుచేశారు. మరోసారి చేస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించి బోర్డు పాతాలని కాలనీవాసులు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో కాలనీవాసులు సత్యం, నరేష్, బాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, భరత్‌కుమార్, నరేష్‌కుమార్,సత్యానారాయణ, ఈశ్వరచారి ఉన్నారు.

కాశీంపూర్‌లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బషీరాబాద్: 'ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో?' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. వారం రోజుల కిందట కేంద్రం ప్రారంభించిన కొనుగోళ్లు జరుగకపోవడంపై ఆరా తీశారు. హమాలీల కొరతతో సకాలంలో ధాన్యం సేకరణ చేయలేకపోయమని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ధాన్యం సేకరణకు చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల సభ్యులకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ధాన్యం తూకాలు చేపట్టారు.

బషీరాబాద్: నవాంద్గీ సొసైటీ భవనం వద్ద సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు వడ్డె హన్మంతు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, నర్సింలు, మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శామీర్‌పేటలోని రైతు సహకార సంఘం, అలియాబాద్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రైతులు నష్టపోకుండా గిట్టు బాటు ధరలను పొందడానికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా, రైతులకు గిట్టుబాటు ధరలను కల్పించడం కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సొసైటీ వైస్ చైర్మన్ మ్యాకల ఐలయ్య, రైతు సహకార సంఘం డైరెక్టర్లు, మాజీ జడ్పీటీసీ అనితలాలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని రక్షించుకుందాం ...


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు చేస్తున్న కుట్రలను తిప్పికొడదామని, మహాత్మా గాంధీ, అంబేడ్కర్‌లను స్మరించుకుందామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కోనాయపల్లి, సంతాపూర్ గ్రామాల్లో సోమవారం జై-సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజ్యాంగంద్వారానే ప్రజలకు హక్కులొచ్చాయన్నారు. రాజ్యాంగం లేక ముందు భూస్వాములు, చదువుకున్న వారికే ఓటు హక్కు ఉండేదని, ఇది గమనించిన అంబేడ్కర్ ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించారని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో జై భీమ్ అంటే మంత్రి అమిత్‌షా ఎద్దేవా చేశారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15నెలల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన, బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు. పేదలకు విద్యుత్ బిల్లుల మాఫీ, ఉచిత బస్సు సౌకర్యం, రేషన్ కార్డులు ఇస్తున్నాట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సూచనలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, నాయకులు వై.యాదయ్య, బాబర్‌ఖాన్, భాస్కర్‌గౌడ్, కరుణాకర్ రెడ్డి, రమేష్, రాణి, జగదీశర్ప, శ్రీధర్‌రెడ్డి, ఇబ్రహీం, రూప్లానాయక్, గిరిధర్, పెంటయ్య, సుందరయ్య, నరసింహులు, సమీర్, నరసింహారెడ్డి, సురేష్, రాములు, రాజేందర్‌రెడ్డి, రాంరెడ్డి, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ రఘునందర్‌రావుతో క్రాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులు

విద్యార్థుల హక్కుల రక్షణకు కృషి

కీసర రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హక్కుల రక్షణకు నిరంతర కృషిచేస్తానని కాంత్రి కీన్ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి కల్యాణి అన్నారు. ఏపీలోని కోరుకొండ, కలిగిరి సైనిక్ స్కూళ్లలో తెలంగాణ రాష్ట్ర విద్యార్థుల కోటాను రద్దు చేస్తూ ఈ నెల 30న దేశ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం క్రాంతి కీన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లితండ్రులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులతో తెలంగాణా విద్యార్థులకు జరగనున్న నష్టాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని అవగతం చేసుకున్న ఎంపీ వెంటనే కేంద్ర రక్షణ మంత్రి సంజయ్‌సేథ్‌తో ఫోన్‌లో సంప్రదించగా మంగళవారం సాయంత్రం కలిసేందుకు అవకాశం కల్పించారు. ఎంపీ మాట్లాడుతూ తెలంగాణాలో కనీసం రెండు సైనిక్ స్కూల్స్ ఏర్పాటు చేసేందుకు, అంతవరకు ఏపీలోని కోరుకొండ, కలిగిరి సైనిక్ స్కూళ్లలో యథావిధిగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంతి కీన్ ఫౌండేషన్ ప్రతినిధులు లావణ్య, జాకబ్, విద్యార్థుల తల్లితండ్రులు ఉన్నారు.

నేల స్వభావాన్ని బట్టి పంట వేయాలి

కడ్తాల్, మే5(ఆంధ్రజ్యోతి): రైతులు నేల స్వభావాన్ని, కాలాన్ని బట్టి అనువైన పంటలు సాగుచేయాలని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. కడ్తాల రైతు వేదికలో సోమవారం ప్రొ.జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన' కార్యక్రమంలో భాగంగా రైతు సదుస్సు నిర్వహించారు. ఏవో ఎ.శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగులో సాంకేతికాంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాలన్నారు. పరిశోధనల ఫలితాలను రైతులకు తెలియజెప్పి అందుకనుగుణంగా సాగుచేసేలా తోడ్పాటు అందిస్తేనే లక్ష్యం నెరవేరుతుందన్నారు. రైతులకు సాగులో మెలకువలను తెలియజెప్పేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చెప్పారు. నీటి యాజమాన్యం, సస్యరక్షణ, విత్తన ఎంపిక, భూసార పరీక్షలు తదిరత అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీత, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్, వైస్ చైర్మన్ డి.సత్యం, శాస్త్రవేత్తలు విద్యాసాగర్, అహ్మద్ హుస్సేన్, మాధవి, ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, సీఈవో దేవేందర్, మాడ్గుల ప్యాక్స్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు వెంకటేశ్, వీరయ్య, నరేశ్, వెంకటయ్య, శ్రీపాల్, బిచ్య, ప్రభాకర్‌రెడ్డి, బోసు రవి, జంగారెడ్డి, శంకర్, రాజేశ్, రామకృష్ణ, రమేశ్, లాయక్‌అలీ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి


బెల్లయ్యనాయక్, రాజశేఖర్‌రెడ్డిలను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

ఆమనగల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పాలనతోనే సామాజిక న్యాయం, అన్ని వర్గాలకు మేలుజరుగుతుందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ తేజవత్ బెల్లయ్యనాయక్, జీహెచ్ఎంసీ కార్పొరేటర్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక విషప్రచారం సాగిస్తున్నారని మండిపడ్డారు. ఆమనగల్లులో సోమవారం బెల్లయ్య, రాజశేఖర్‌రెడ్డిలు పర్యటించి పార్టీ జిల్లా నాయకుడు మండ్లీ రాములు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నేతలను ఆదివాసీ విభాగం రాష్ట్ర నాయకుడు కృష్ణానాయక్ ఆధ్వర్యంలో సత్కరించారు. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చాలన్న సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత, చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని వారు అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రెండేళ్లలో ప్రతితండాకు బీటీరోడ్డు వేసేలా కార్యాచరణను అమలు చేస్తున్నామన్నారు. పార్టీకి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పర్వతాలు, శ్రీనునాయక్, వెంకట్‌రెడ్డి, రాజేందర్‌నాయక్, రమేశ్‌నాయక్, హర్యనాయక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు భూధార్

తాండూర్ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 11 నంబర్లతో విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కొమురయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలిపారు. భూమి ఉన్న ప్రతీ రైతు భూములకు సంబంధించిన వివరాలతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ చేపడుతున్నట్టు చెప్పారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను, రైతు ఆధార్ సంఖ్యను అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీని కేటాయిస్తామని తెలిపారు. పీఎం కిసాన్ లబ్ధిదారులకు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ప్రామాణికంగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతు భరోసా, రుణమాఫీ తదితర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీతో ఏ విధమైన సంబంధం ఉండదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు భూయాజమాన్య పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నంబర్‌తో వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీసేవ కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

'దోస్త్' రిజిస్ట్రేషన్లు ప్రారంభం

మహేశ్వరం, మే 5 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దోస్త్ నోటిఫికేషన్ విడుదలైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేష్ తెలిపారు. మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలనుకునే విద్యార్థులు మొదటి ఆప్షన్‌గా మహేశ్వరాన్ని ఎంచుకోవాలన్నారు. మహేశ్వరం డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులకు 240 సీట్లు ఉన్నాయని, దీని కోసం ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 3 నుంచి 21 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఈనెల 10 నుంచి 22వరకు వెబ్ ఆప్షన్లు ఉంటాయన్నారు.

చేవెళ్ల డిగ్రీ కళాశాలలో..

చేవెళ్ల: చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొత్త అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ కాంచన లత తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు అడ్మిషన్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94901 17498, 83281 76599 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మోడల్ జూనియర్ కళాశాలలో..

కందుకూరు: మండలంలోని నేదునూరు మోడల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుప్రియ కోరారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు మంగళవారం నుంచి ఈనెల 20వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రూపులో 40సీట్లు మాత్రమే ఉన్నాయని, అర్హత కలిగిన ఇంటర్మీడియట్ విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈనెల 26న వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు.

యాచారం ఎంపీడీవో బదిలీ

యాచారం, మే 5 (ఆంధ్రజ్యోతి): యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి సోమవారం బదిలీ అయ్యారు. ఆయన హైదరాబాద్‌లోని కమిషనర్ ఆఫ్ రూరల్‌డెవలప్‌మెంట్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. యాచారం మండలానికి ఇరువురు మహిళలు పోటీ పడుతున్నారని సమాచారం. ఎన్నికల ముందు మండలానికి వచ్చి ప్రజలతో సత్సంబంధాలు పెంచుకొని తరచూ గ్రామాలలో తిరిగి ప్రజల సమస్యలు తీర్చారు. ఇటు ఉద్యోగులతో, అటు ప్రజలతో ఉంటూ ప్రజల సాదకబాదలను తీర్చారు. కాగా సోమవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. మండల ప్రజల ఆదరాబిమానాలను మరువలేనని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు.

షాద్‌నగర్ ఏడీఏకు పదోన్నతి

చౌదరిగూడ, మే 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న చిల్కమర్రి రాజరత్నం పదోన్నతి పొందారు. జిల్లేడ్ మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన చిల్కమర్రి రాజరత్నం వ్యవసాయ శాఖలో షాద్‌నగర్ నియోజకవర్గంలో రైతుల మన్ననలు పొందారు. నారాయణపేట జిల్లాకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి రావడంతో (ఆత్మ) పీడీగా బదిలీపై వెళ్లనున్నారు.

బీజేపీ కొత్తూర్ మున్సిపల్ అధ్యక్షుడిగా రణధీర్‌గౌడ్

కొత్తూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మున్సిపాలిటీ శాఖ అధ్యక్షుడిగా తిమ్మాపూర్‌కు చెందిన అమడపురం రణధీర్‌గౌడ్‌ను నియమితులయ్యారు. ఈ మేర కు జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ లేఖ విడుదల చేశారు. ఈ సందర్భంగా రణధీర్‌గౌడ్ మాట్లాడుతూ తన నియమాకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీ యాచారం అధ్యక్షుడిగా విజయ్‌నాయక్

యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ యాచారం మండల అధ్యక్షుడిగా తక్కళ్లపల్లి తండాకు చెందిన ప్రముఖ న్యాయవాది విజయ్‌నాయక్‌ను రాష్ట్ర కమిటీ సోమవారం నియమించింది. ఇప్పటివరకున్న అధ్యక్షుడు తాంద్ర రవీందర్ పదవీకాలం ముగియడంతో విజయ్‌నాయక్‌కు మండల బాధ్యతల ప్పగించింది. ఈ సందర్భంగా విజయ్‌నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీకి పూర్తిస్థాయిలో సేవలందిస్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలో పార్టీకి అధిక స్థానాలు దక్కేలా పని చేస్తానన్నారు.

పాతాళానికి జలం!

(5వ పేజీ తరువాయి)

సాధారణ వర్షపాతం నమోదైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రత, విచ్చలవిడిగా నీటి వినియోగంతో భూగర్భ జలాల శరవేగంగా ఇంకిపోతున్నాయి. ఫిబ్రవరిలో 11.22 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉంటే.. మార్చిలో 12.58 మీటర్ల లోతులోకి చేరాయి. రోజుల వ్యవధిలోనే 1.37 మీటర్ల మేర నీటి మట్టం తగ్గిపోయింది. అలాగే మార్చిలో 12.58 మీటర్ల లోతులో నీరు ఉండగా ఏప్రిల్‌లో 14.91 మీటర్ల లోతులోకి చేరుకుంది. నెల వ్యవధిలో -2.33 మీటర్ల మేర మట్టం తగ్గటం ఆందోళన కలిగిస్తుంది. ఎండల తీవ్రత మరింత పెరిగితే భూగర్భ జలాలు ఇంకా పడిపోయే అవకాశం ఉంది.

ప్రమాద ఘంటికలు..

జిల్లాలోని కొన్ని మండలాల్లో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. భూగర్భజల శాఖ అధికారులు విడుదల చేసిన గ్రౌండ్ వాటర్ రిపోర్టును పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తుంది. శేరిలింగపల్లి, సరూర్‌నగర్ మండలాల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. ఈ రెండు మండలాల్లో నీటి వినియోగం అతిగా ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటాయి. శేరిలింగంపల్లిలో మార్చిలో 23.12 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఏప్రిల్‌లో -6.16 మీటర్ల లోతులోకి పడిపోయాయి. సరూర్‌నగర్ మండలంలో మార్చి నెలలో 19.78 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఏప్రిల్ నెలలో 25.93 మీటర్లకు చేరుకుంది. -6.15 మీటర్లు లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. హయత్‌నగర్‌లో నీటి గండం ఏర్పడింది. ఈ మండలంలో మార్చిలో భూగర్భ జలాల నీటి మట్టం 13.87 మీటర్లు ఉండగా ఏప్రిల్‌లో 20 మీటర్ల లోతులోకి చేరింది. నెల వ్యవధిలో -6.13 మీటర్లు అట్టడుగుకు చేరుకుంది. చౌదరిగూడ మండలంలో నీటి వినియోగం పెరిగింది. ఈ మండలంలో మార్చి నెలలో భూగర్భ జలాల నీటి మట్టం 10.35 మీటర్లు ఉండగా, ఏప్రిల్ నెలలో నీటి మట్టం 15.61 మీటర్ల లోతులోకి చేరుకుంది. -5.26 మీటర్లు మైనస్‌లోకి నీరు వెళ్లింది. అబ్దుల్లాపూర్‌మెట్, కొందుర్గు, ఫరూక్‌నగర్, కడ్తాల్, షాబాద్, తలకొండపల్లి, శంషాబాద్ మండలాల్లో ప్రమాద సూచికలు కనిపిస్తున్నాయి.

వేగంగా తగ్గుదల

వర్షపాతంలో అంతగా మార్పులు లేకపోయినా భూగర్భ జలాలు వేగంగా ఇంకిపోతున్నాయి. భూమిలోకి చేరాల్సిన జలాలు దూరం అవుతున్నాయి. ఓ వైపు దంచి కొడుతున్న ఎండలు.. మరో వైపు రోజురోజుకూ పెరుగుతున్న నీటి అవసరాలతో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. బోర్లు, బావులు ఎండుతున్నాయి. వాగులు వంకలు ఎడారిని తలపిస్తున్నాయి. 1200 ఫీట్ల వరకు బోరు వేసినా చుక్క నీరు రావడం లేదు. బోర్లు వేస్తున్న రైతులు అప్పులపాలవుతున్నారు. అనుమతి లేకుండా బోర్లు వేయొద్దని అధికారులు సూచిస్తున్నా కొందరు బేఖాతర్ చేస్తున్నారు.

జిల్లాలో భూగర్భ జలాలు (మీటర్లలో)

మండలం	మార్చి	ఏప్రిల్	వ్యత్యాసం
అబ్దుల్లాపూర్‌మెట్	7.73	11.23	-3.51
ఆమనగల్లు	7.61	8.44	-0.83
బాలపూర్	8.24	8.73	-0.49
చేవెళ్ల	12.00	12.96	-0.96
చౌదరిగూడ	10.35	15.61	-5.26
ఫరూక్‌నగర్	8.68	10.93	-2.25
గండిపేట్	10.13	9.98	-0.15
హయత్‌నగర్	13.87	20.00	-6.13
ఇబ్రహీంపట్నం	18.48	19.26	-0.79
కడ్తాల్	12.45	15.82	-3.36
కందుకూరు	9.52	9.37	-0.15
కేశంపేట్	7.15	7.69	-0.55
కొందుర్గు	7.15	10.74	-2.14
కొత్తూరు	11.65	13.83	-2.19
మాడ్గుల	9.02	7.68	-1.35
మహేశ్వరం	13.88	14.40	-0.52
మంచాల	15.44	16.17	-0.74
మొయినాబాద్	11.91	12.82	-0.92
నందిగామ	5.98	6.83	-0.85
రాజేంద్రనగర్	9.89	10.90	-1.01
సరూర్‌నగర్	19.78	25.93	-6.15
శేరిలింగంపల్లి	23.12	25.44	-6.16
షాబాద్	14.59	16.90	-2.31
శంషాబాద్	9.88	12.26	-2.38
శంకర్‌పల్లి	12.86	14.46	-1.60
తలకొండపల్లి	15.47	18.61	-3.14
యాచారం	10.50	11.30	-0.81
మొత్తం	12.58	14.91	-2.33

బోరుమంటున్న బావులు

185 ఎకరాల్లో ఎండిన కూరగాయల తోటలు

యాచారం: మూడేళ్లుగా ఆశించిన మేర వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు పడిపోయి బోర్‌బావులు ఎండిపోతున్నాయి. కూరగాయ తోటలు నిలువునా మాడిపోతున్నాయి. డ్రిప్‌ద్వారా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నా నీరందక తోటలు నిలువునా ఎండిపోయి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మండలంలో 350 ఎకరాల్లో కూరగాయలు సాగుచేయగా 185 ఎకరాలో తోటలు ఎండిపోయాయి. మండలంలోని యాచారం, చౌదర్‌పల్లి, మేడిపల్లి, మొండిగౌరెల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి, కుర్మిద్ద, మల్కీజ్‌గూడ, గడ్డమల్లాయాగూడ తదితర గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. బోర్‌మోటార్ ఆన్‌చేసిన కొద్దిసేపటికే గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పంటలకు సరిపడా నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎండిన తోటను చూపిస్తున్న మహిళా రైతు

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

శంకర్‌పల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ లక్ష్మీ అన్నారు. లక్ష్మారెడ్డిగూడ గ్రామంలో సోమవారం నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పంట మార్పిడితో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేష్ బాబు, ఇన్‌చార్జి ఏవో సురేష్‌బాబు, ఏఈవో మనీష పాల్గొన్నారు.

కొత్తూర్: పంట మార్పిడితో సుస్థిర లాభాలు ఉంటాయని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రామానుంజమం, వ్యవసాయ శాఖ ఏడీఏ రాజారత్నం అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వలో నిర్వహించిన 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమానికి హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వ్యవసాయ సంబంధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, డాక్టర్ చైతన్య, రవి పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త శర్మ

యాచారం: రైతులు మంచి దిగుబడులు సాధించాలంటే భూసార పరీక్షలు చేయించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఏకాద్రి, భూసారశాస్త్రవేత్త డాక్టర్ రాజేశ్వర్ అన్నారు. మండలంలోని గడ్డమల్లాయాగూడలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. వేసవి దుక్కులతో పాటు పొలాల్లో మేకలు, గొర్రెల మందలను పెట్టుకుంటే 40 శాతం నేల సారవంతం అవుతుందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహరావు, ఏడీఏ సుజాత, సొసైటీ చైర్మన్ టి.రాజేందర్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణబాబు, ఏఈ రవినాథ్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కడ్తాల్: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతన ర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. కడ్తాల మండలం ముద్విన్ గ్రామంలో ఆమనగల్లు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ అరుణకుమారి, ఏవో శ్రీలత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, సేవ్యానాయక్, జోగు వీరయ్య, శ్రీపాల్, వెంకట్ రెడ్డి, సీఈవో దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలించి మద్దతు ధర పొందాలని మోకిల సొసైటీ చైర్మన్ గోపాల్ అన్నారు. సోమవారం మోకిలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వేణు, ఇన్‌చార్జి ఏవో సురేష్ బాబు, ఏఈవో రామకృష్ణారెడ్డి, గ్రామ కార్యదర్శి ఎల్లయ్య, మోహన్‌రెడ్డి, నర్సింహులు, వెంకటేష్, లింగం, సత్యం, అనిల్ ఉన్నారు.



కడ్తాల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంప వెంకటేశ్, యాట గీతానర్సింహ

ఆమనగల్లు: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆమనగల్లు ఇన్‌చార్జి ఏడీఏ అరుణ కుమారి కోరారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె సందర్శించారు. విక్రయానికి తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

ఆమనగల్లు, మే 3(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లుకు చెందిన పెయింటర్ మహ్మద్ మస్తాన్, దాసులను పెయింటర్ల యూనియన్ నాయకులు సోమవారం పరామర్శించారు. మస్తాన్, దాసు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి చేరుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈమేరకు పెయింటర్ల సంఘం నాయకులు వారిని పరామర్శించి యూనియన్ తరఫున రూ. 20 వేలు ఆర్థికసాయం అందజేశారు. అధ్యక్షుడు వస్పుల మహేశ్, ఉపాధ్యక్షుడు మహేశ్, కోశాధికారి వెంకటేశ్, గౌరవాధ్యక్షుడు మమ్మద్ సయ్యద్, ఆనంద్ ఉన్నారు.

వడివడిగా..!

(5వ పేజీ తరువాయి)

వరకు పూర్తయ్యింది. ఈ ఇళ్లను ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఫొటో క్యాప్చర్ చేశారు. అనంతరం ఐదుగురి లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున వారి ఖాతాలో జమచేశారు. ఇంటి నిర్మాణ డబ్బులు ఖాతాలో జమకావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనల మేరకు నిర్మాణం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు. 400 ఎస్ఎఫ్‌టీకి తగ్గకుండా, 600 ఎస్ఎఫ్‌టీకి పెరగకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి. ప్రభుత్వం సూచించిన విధం గా ఇళ్లు కడితే బిల్లులు పొందడానికి మార్గం సులువుగా ఉంటుంది. అనసవరంగా ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు కట్టినా, తగ్గించినా బిల్లులు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురువుతాయని అధికారులు చెప్పారు.

బిల్లుల చెల్లింపు ఇలా..

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం రూ. 5లక్షలు ఇస్తుంది. ఇందులో బేస్‌మెంట్ లెవల్ పూర్తయితే రూ. 1,00,000, గోడల వరకు పూర్తి చేస్తే రూ.1,25,000, స్లాబ్ వరకు పూర్తయితే రూ.1,75,000, ఇంటి నిర్మాణం పూర్తయితే మిగతా రూ.1,00,000 ఇస్తారు. ఇలా విడతల వారీగా లబ్ధిదారులకు రూ.5లక్షలు ప్రభుత్వం ఇవ్వనుంది.

లక్ష రూపాయలు ఖాతాలో పడ్డాయి

మా కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. ఇంటి పనులు ప్రారంభించాం. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేశాం. పంచాయతీ సెక్రెటరీ ఫొటో తీసుకుపోయాడు. మా బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయలు జమయ్యాయి.



\- కర్రెకోట శారద బాయి, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు, పోమాల్‌పల్లి

పట్నంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం

ఇబ్రహీంపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని డిజిటలైజ్ చేసేందుకు ప్రతీ రైతుకు ఆధార్ అనుసంధానంతో 14 నంబర్లతో విశిష్ట సంఖ్య(యూనికోడ్) కేటాయించనున్నట్లు మండల వ్యవసాయాధికారి విద్యాధరి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం చేపట్టారు. భూమి ఉన్న ప్రతి రైతుకు తమకు ఉన్న భూములకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టామన్నారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేస్తామన్నారు. పీఎం కిసాన్ వంటి కేంద్ర పథకాల కోసం దీనిని నమోదు చేస్తున్నామన్నారు. రైతు భరోసా, రుణ మాఫీ తదితర రాష్ట్ర పథకాలకు ఫార్మర్ రిజిస్ట్రీకి సంబంధం లేదని చెప్పారు. ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండురంగారెడ్డి, ఏఈవో వై.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు

శంషాబాద్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు కాంగ్రెస్ పార్టీ నేతలు. మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు అధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు సోమవారం ఆయన నివాసంలో కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ముమ్ముందు మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని తన్వీరాజు ఆకాంక్షించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు

క్రైం కార్నర్

గుర్తు తెలియని ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ఆదిభట్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెంట్ మండలం, తుర్కయంజాల్, సుభాష్‌నగర్‌కు చెందిన జర్పుల మోతిలాల్ (52) తుర్కయంజాల్‌లోని లేబర్ అడ్డాకు ఆదివారం కూలి పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో తుర్కయంజాల్ అక్షరసిరి స్టీల్ షాప్ సమీపంలో రోడ్డు దాటుతుండగా బీఎన్‌రెడ్డి నగర్ నుంచి మన్నెగూడ వైపునకు వస్తున్న గుర్తు తెలియని ఆటో అతివేగంగా వచ్చి మోతిలాల్‌ను ఢీకొట్టడడంతో మోతిలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మోతీలాల్ కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో ఈతకు వెళ్లిన యువకుడు..

శంకర్‌పల్లి, మే 5(ఆంధ్రజ్యోతి): ఈతకు వెళ్లిన ఓ యువకుడు మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన చిన్నన్నోళ్ల మహేష్(32) మున్సిపాలిటీలో ప్రైవేటు వర్కర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం శంకర్‌పల్లి మండలంలోని మీర్జాగూడ పరిధిలోని బతుకుంట చెరువు వద్దకు స్నేహితుడు శ్రీనివాస్‌తో కలిసి ఈత కొట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మహేష్ చెరువులో పడి మృతి చెందాడు. అతడికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు, పాప ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరి గడ్డి దగ్ధం

ఇబ్రహీంపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): గడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌కు కరెంటు వైర్లు తగిలి మంటలు అంటుకున్నాయి. కదులుతున్న ట్రాక్టర్ ట్రాలీ హైడ్రాలిక్ ఎత్తడంతో రోడ్డు నిండా గడ్డిపడి మంటలు చెలరేగాయి. ఫైరింజన్ సాయంతో మంటలార్పడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం ఎలిమినేడు గ్రామంలో చోటుచేసుకుంది. కందుకూరు మండలం లేమూరుకు చెందిన ఓ రైతు ట్రాక్టర్‌పై వరి గడ్డిని తీసుకుని ఎలిమినేడు గుండా వెళ్తుండగా కరెంటు వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ట్రాక్టర్‌ను డ్రైవర్ అలాగే ఊరు దాటించి ట్రాలీ హైడ్రాలిక్ ఎత్తాడు. దీంతో కాలుతున్న గడ్డి రోడ్డుపై పడిపోయింది. అప్పటికే డ్రైవర్‌తోపాటు మరో ఇద్దరు కూలీలు ట్రాక్టర్‌పై ఉన్నారు. వీరు సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలార్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దారి దోపిడీ.. నిందితుల అరెస్ట్

చేవెళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): అడ్డ కూలీలను లక్ష్యంగా చేసుకొని దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సోమవారం చేవెళ్ల పోలీస్‌లు రిమాండ్‌కు తరలించారు. చేవెళ్ల డిటెక్టివ్ సీఐ ఉపేందర్ తెలిపిన ప్రకారం.. వరంగల్ జిల్లా గూడూర్ మండలం చందుర్‌గూడెం గ్రామానికి చెందిన సంపాంగి శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన పిటాల వెంకటమల్లు స్నేహితులు. ఇద్దరు కలిసి అడ్డా కూలీలకు పని కల్పిస్తామని నమ్మించి తమవెంబడి కొద్దిదూరం తీసుకెళ్లి మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకొని పరారవుతున్నారు. చేవెళ్ల, నందిగామ, షాద్‌నగర్, నల్గొండ, వికారాబాద్, హుజుర్‌నగర్, సిద్దిపేట్, మహబూబాబాద్, తదితర ప్రాంతాల్లో మూడు దోపిడీలు, నాలుగు స్నాచింగ్‌లు, రెండు ఆటోమొబైల్ దోపిడీలకు పాల్పడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని రాజేంద్ర నగర్, శంషాబాద్, చేవెళ్ల క్రైం టీం బృందాలు గాలింపు చేపట్టి ఇద్దరిని సోమవారం పట్టుకొని విచారించి రిమాండ్‌కు తరలించారు.

వేసవి శిబిరాలను ఉపయోగించుకోవాలి



యాచారం: విద్యార్థులకు నోట్‌బుక్కులు అందజేస్తున్న ఎంఈవో

యాచారం, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతపట్ల ఉన్నత పాఠశాలలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఎంఈవో పాండురంగారెడ్డి ప్రారంభించారు. యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్‌లో శిక్షణతోపాటు స్నాక్స్ అందిస్తామని పేర్కొన్నారు. పీడీ సాబేర్, ఉపాధ్యాయులు జగన్, రాధాకృష్ణ, అంజయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

కేశంపేట: తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 19వరకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తపేట, కేశంపేట, పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. శిబిరంలో విద్యార్థులకు సంగీతం, చదరంగం, చిత్రలేఖనం, ఇండోర్ గేమ్స్, టీఎల్ఎం తయారీ, వ్యక్తిత్వ వికాసం, కథలు చెప్పడం, యోగా, ధ్యానం, సెల్ఫ్ డిఫెన్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. యాదయ్య, లక్ష్మమ్మ, రామస్వామి పాల్గొన్నారు.

ఆమనగల్లు: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే విద్యతోపాటు జీవిత నైపుణ్యాలు, నైతిక విలువలు పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ అన్నారు. క్రీడలతోపాటు కళల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ఎంఈవో పాండుతో కలిసి శంకర్ నాయక్ ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. మే 19 వరకు శిక్షణ కొనసాగుతుందని ఎంఈవో పాండు పేర్కొన్నారు. కరాటే మాస్టర్ జాన్సన్, డ్యాన్స్ మాస్టర్ ప్రభుశంకర్, పీఈటీ అజీమ్, సీఆర్పీలు షేక్ అహ్మద్, కిషన్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కేశంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం 12 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాజారత్నం, తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఆర్ఐ నివేదిత, నాయకులు గూడ వీరేష్, జగదీశ్వర్, శ్రీధర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, రమేష్, సుదర్శన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

చేవెళ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలమైన వ్యక్తుల్లో కారల్ మార్క్స్ ఒకరిగా నిలిచారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణచారి అన్నారు. కారల్‌మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సోమవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో ఆయన ఫొటోకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, నాయకులు మంజులు, శివుడు, మీనాక్షి ఉన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

షాద్‌నగర్‌రూరల్, మే5(ఆంధ్రజ్యోతి): వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను సోమవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో రెండు రోజుల క్రితం కురిసిన వడగండ్ల వానకు వరి పంట దెబ్బతిన్నది. వడ్లు పూర్తిగా నేల రాలాయి. విషయం తెలుసుకున్న వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించారు. ఎనిమిది మందికి చెందిన 13 ఎకరాల 20 గుంటల వరి పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారి నిషాంత్ కుమార్ తెలిపారు. పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

ఘనంగా సబితా ఇంద్రారెడ్డి జన్మదిన వేడుకలు



కందుకూరు: సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు



శంషాబాద్ రూరల్/శంషాబాద్: సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



మహేశ్వరం: ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు. సోమవారం తుక్కుగూడలో సబితాఇంద్రారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడానికి ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్ సురేందర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు ఎలుక మేఘనాథ్‌రెడ్డి, సామ మహేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివెల్లారు. వేడుకల్లో నేదునూరు మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి, నాయకులు అనేగౌని అంజయ్యగౌడ్, పొట్టి ఆనంద్, సామ ప్రకాశ్‌రెడ్డి, రాయిచెట్టి యాదయ్య, అనేగౌని దామోదర్‌గౌడ్, సరికొండ వెంకటేష్‌గౌడ్, తాళ్ల కార్తీక్, బర్కం వెంకటేష్, బొక్క దీక్షిత్‌రెడ్డి, టి.హన్మంత్‌రెడ్డి,గాదె రవీందర్, తాళ్ల సోను పాల్గొన్నారు.

మహేశ్వరం: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేటలోని సామయాదిరెడ్డి గార్డెన్‌లో ఆమె అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కేక్‌లు కట్ చేయించారు. పూల మాలలు, పుదీనా దండలు, శాలువాలతో ఆమెను సత్కరించి అభిమానం చాటుకున్నారు. మహేశ్వరం, తుక్కుగూడ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆంగోత్‌రాజునాయక్, జెల్లల లక్ష్మయ్య, చంద్రయ్య, అంబయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, రవినాయక్, వర్కల యాదగిరి, దేవ్లానాయక్, ప్రభాకర్, ఆదిల్, వెంకట్‌రెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్/శంషాబాద్: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి నివాసానికి వెళ్లి కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మశ్రీనివాస్, మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్ తదితరులు పాల్గొన్నారు.